
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 15 మార్చి 2025





## ● హోలీ సంబరం

రంగుల పండుగ హోలీని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. చిన్నారులు, యువతీ యువకులు ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ డ్యాన్సులు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సందడిగా గడిపారు. 4లో



## ● దేదీప్యం..

### నేడు వెంకటపాలెంలో శ్రీవారి కల్యాణం

రాజధాని గ్రామం వెంకటపాలెంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం కల్యాణోత్సవానికి సిద్ధమైంది. విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. శనివారం శ్రీనివాసుని కల్యాణానికి టీటీడీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు స్వామి వారి కల్యాణోత్సవం జరగనుంది. 4లో

# ప్రతిపాదనలతో సరి!


## కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువన చోడవరం, బొబ్బర్లంకలో బ్యారేజీల నిర్మాణానికి నాడు ప్రణాళిక

- 8.226 టీఎంసీలకుపైగా నీటిని నిల్వ ఉంచేలా అంచనాలు
- ప్రభుత్వానికి డీటెయిల్ట్ ప్రాజెక్టు రిపోర్టు
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంపైనే ప్రజల ఆశలు

కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువన రెండు బ్యారేజీల నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. కృష్ణాజిల్లా సాగు, తాగునీటి అవసరాలు తీరాలంటే ఈ బ్యారేజీలు అత్యంత కీలకం. ఎప్పటి నుంచో బ్యారేజీలు ఊరిస్తున్నాయి. ప్రతిపాదనలు అమలుకు నోచుకోవటంలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో వీటి గురించి పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ రెండు బ్యారేజీల నిర్మాణానికి డీటెయిల్ట్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వ స్థాయిలో ఇంకా ఆమోదం రావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారం అనుకుంటే.. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులలో అంతర్భాగంగా అయినా కేంద్రం నిధులతో వంతెనల స్థానంలో బ్యారేజీలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని అవనిగడ్డ, మచిలీపట్నం, పామర్రు, పెడన, గుడివాడ నియోజకవర్గాలు సముద్రతీరం వెంబడి ఉన్నాయి. ఏటా వేసవిలో తాగునీటి సమస్యలు ఎదురవుతాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడుతుంటారు. కృష్ణానదికి ఏటా ఆగస్టు నుంచి నవంబరు వరకు పెద్దఎత్తున వరద నీరు వస్తూ ఉంటుంది. కృష్ణానదికి ఎగువున ఉన్న నదీ పరివాహక ప్రాంతాల్లో భారీవర్షాలు కురిస్తే ప్రకాశం బ్యారేజీకి వరదనీరు చేరుతుంది. ఇక్కడ 12 అడుగులకు మించి వరద నీటిని నిల్వ ఉంచేందుకు అవకాశం లేదు. దీంతో ఏడాదికి కనీసంగా 250 టీఎంసీలు, అంతకుమించిన వరదనీటిని సముద్రంలోకి వదిలేయాల్సిందే. ప్రకాశం బ్యారేజీ దిగువున నీటిని నిల్వ ఉంచేందుకు బ్యారేజీలు లేకపోవడంతో పూర్తి స్థాయిలో నీరు సముద్రంలో కలసిపోతోంది. ఒకవైపు వందలాది టీఎంసీల వరదనీరు నదిలోనుంచి సముద్రంలో కలసిపోతున్నా, పంట కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయలేని స్థితి ఏర్పడుతుంది. వర్షాకాలంలో వర్షాలు సకాలంలో పడకపోతే ఖరీఫ్ సీజన్‌లోనూ సాగునీటి ఎద్దడి నెలకొంటోంది. దీంతో కాలువలకు సరిపడా నీటిని వదలలేని స్థితి ఏర్పడుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. సాగు నీటి అవసరాల కోసం గోదావరి నది నుంచి పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటిని పంపింగ్ చేయాల్సి వస్తోంది. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత మొదటి సంవత్సరమే దాళ్వా పంటకు నీరిచ్చి, మిగిలిన నాలుగు సంవత్సరాలు చేతులెత్తేసింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో తీరప్రాంత మండలాల్లో వరిసాగుకు మిగతా 4లో..

మోపిదేవి మండలం బొబ్బర్లంక వద్ద బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతం



### అంచనాలకే పరిమితం

కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువన రెండు బ్యారేజీల నిర్మాణానికి డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును అధికారులు తయారు చేసి పంపారు. ఈ ప్రతిపాదనలకు స్టేజ్-1 పరిపాలనా ఆమోదం పొంది అక్కడే ఆగిపోయినట్లు సమాచారం. వీటికి గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన రేట్లతో నివేదిక కాకుండా 2023-24 రేట్లకు అనుగుణంగా నివేదికలు తయారు చేసి పంపారు. గత ఐదు సంవత్సరాలుగా నివేదికలు వెళ్లినా నిధులు మాత్రం విడుదల కావడం లేదు. గతంలో బ్యారేజీల పనులు ప్రారంభించేందుకుగాను రెండు ప్రాంతాల్లో సాయిల్ టెస్టులు నిర్వహించారు. ఆ తర్వాత మిన్నకుండిపోయారు. ప్రకాశం బ్యారేజీలో వేసవి కాలంలో నీరు అందుబాటులో లేకుంటే చల్లపల్లి మండలం నడకుదురు లేదా ఘంటసాల మండలం శ్రీకాకుళం వద్ద నుంచి మచిలీపట్నంలోని పంపులచెరువు వరకు పైప్‌లైన్ వేసి నీటిని పంపింగ్ చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది. కానీ ఈ రెండు బ్యారేజీల నిర్మాణానికి నిధులు విడుదల చేయకుండా, సాంకేతిక కారణాలను సాకుగా చూపి జాప్యం చేస్తూ వస్తున్నారు. ఈ బ్యారేజీల నిర్మాణం పూర్తి చేస్తే జిల్లాలో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని, కూటమి ప్రభుత్వమైనా నిధులు సమకూర్చాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

# పైపైకి..

## భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు



- బంగారం 22 క్యారెట్లు రూ.8,580, 24 క్యారెట్లు రూ.9,050
- కిలో వెండి రూ.1,03,000

వన్‌టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. 22 క్యారెట్ల బంగారం రూ.8,580 కాగా, 24 క్యారెట్లు రూ.9,050 చేరింది. కిలో వెండి రూ.1,03,000 ధర పలికింది. ఆయా ప్రాంతాలను బట్టి కూడా ధరల్లో కొద్ది మార్పు కనిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్కసారిగా బంగారం, వెండి ధరలు పెరిగాయి. గురువారం ఔన్స్ గోల్డ్ ధర 2,945 డాలర్లు ఉండగా, శుక్రవారం అమాంతంగా 43 డాలర్లు పెరిగి 2,988 డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం ఔన్స్ సిల్వర్ ధర 33.80 డాలర్లుగా ఉంది. అయితే ఈ ధరల్లో శనివారం నాటికి మరికొంత మార్పు ఉంటుందని చెబుతున్నారు. ఇటీవల కాలంలో బంగారం, వెండి జోలికి వెళ్లేందుకు సామాన్య, మధ్యతరగతి ప్రజలు భయపడుతున్నారు. వివాహ సమయంలో ఆడపిల్లలకు తమ శక్తి కొలది బంగారు నగలు చేయించి కానుకగా ఇవ్వటం జరుగుతుంది. ధరలు అమాంతం పెరిగిపోవటంతో వాయిదా వేసుకుంటున్న పరిస్థితి అక్కడక్కడ కనిపిస్తోంది. ఇటీవల కాలంలో బంగారం, వెండి ధరలు ప్రతి రోజూ అంతో ఇంతో పెరుగుతూనే ఉన్నాయి. ఒకవేళ తగ్గింది అనుకున్నా కూడా నామమాత్రమే. అంతర్జాతీయ మార్కెట్‌ను అనుసరించి ఈ బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. ఏదైనా వెండి ధరలు మరింతగా పెరగటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇటీవల కాలంలో వెండి ధర దాదాపుగా లక్ష రూపాయలకు అటు, ఇటుగా నడుస్తూనే ఉంది. వెండి కంచాలు, వెండి పాత్రలు, ముఖ్యంగా పూజా సామగ్రి వంటి వాటిని ఆడపిల్లలకు కొని ఇద్దామంటే భారమైన పరిస్థితి నెలకొంది. బంగారం, వెండి ధరలు ఏరోజు ఎంత పెరిగాయి, ఎంత తగ్గాయి అనే దానిపై గృహిణులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

జీలగలగండిలో లారీని ఢీకొన్న బొలెరో వాహనం



ఎ.సీతారాంపురంలో లారీని ఢీకొన్న కారు



# ముగ్గురి ఉసురు తీసిన అతివేగం

- లారీని బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు మృతి
- మరో ఘటనలో లారీని కారు ఢీకొని ఒకరు దుర్మరణం

## జాతీయ రహదారుల్లో రెండు చోట్ల రోడ్డు ప్రమాదాలు

### రెండు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

- కృష్ణాజిల్లా జీలగలగండి, ఎ.సీతారాంపురంలో ఘటనలు
- మృతులది పశ్చిమ గోదావరి జిల్లా, ఎన్టీఆర్ జిల్లా

ఘంటసాల/హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. రెండు చోట్ల అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

**రొయ్య పిల్లలను లోడ్ చేసుకుని వెళ్తుండగా..**

కృష్ణాజిల్లా ఘంటసాల మండలం జీలగలగండి గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బొలెరోలోని ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘంటసాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పాతర్లమరక గ్రామానికి చెందిన కోటే వరప్రసాద్ (58), కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన చీపురుపల్లి శివకృష్ణ (29) బొలెరో వాహనంలో ఒంగోలులో రొయ్య పిల్లలను లోడ్ చేసుకుని కాళ్ల బయలుదేరారు. అస్సాం నుంచి చీరాలకు సరుగుడు బాదుల లోడ్‌తో వెళ్తున్న లారీని ఘంటసాల మండలం యందకుదురు శివారు జీలగలగండి గ్రామం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున 3.20 గంటలకు బొలెరో వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ఉన్న వరప్రసాద్, శివకృష్ణ అక్కడికక్కడే మృతి చెందారు. నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న మిగతా 4లో..

**దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా..**


దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన ఘటన జాతీయ రహదారిపై బాపులపాడు మండలం ఎ.సీతారాంపురంలో శుక్రవారం జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ లోని అశోక్‌నగర్‌కు చెందిన పెద్ది వేణుమాధవ్ భార్య తేజస్విని, తల్లి పద్మావతి(72)తో కలిసి కొవ్వూరులోని శ్రీరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై ఎ.సీతారాంపురం వద్ద కారు డ్రైవర్ కళ్లపై సూర్యకిరణాలు పడటంతో కారు అదుపు తప్పి ముందు వెళ్తున్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు సీట్లో కూర్చున్న పద్మావతి అక్కడికక్కడే మృతి చెందగా, కారు డ్రైవర్ రవి, వెనుక సీట్లో కూర్చున్న వేణుమాధవ్, తేజస్విని గాయపడ్డారు. వెంటనే వీరిని అంబులెన్సులో విజయవాడలోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్ ఘటనాస్థలానికి చేరుకుని పద్మావతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అమరావతి రాజమార్గాలకు డీపీఆర్‌లు సిద్ధం

## ఈ-13, 15 రోడ్లకు రూ.1,142.05 కోట్లతో టెండర్లు

### ఎన్‌హెచ్-16కు అనుసంధానం చేస్తూ ఏర్పాట్లు

- అటవీ భూమి ల్యాండ్ కన్వర్షన్ కోసం కేంద్రానికి ప్రతిపాదనలు
- 6 వరసల డివైడెడ్ ఆర్‌వోబీ కోసం రైల్వేమంత్రికి సీఎం వినతి




రోడ్లకు సంబంధించిన ప్రతిపాదిత మ్యాప్

విజయవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజమార్గాలకు డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. టెండర్లు పిలవడానికి సీఆర్‌డీఏ అధికారులు రంగం సిద్ధం చేశారు. 16వ నంబరు జాతీయ రహదారి నుంచి అమరావతికి అనుసంధానంగా ప్రధాన మార్గాలైన ఈ-13, ఈ-15 రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ రెండు ప్రధాన రహదారుల అభివృద్ధికి కన్సల్టెన్సీ సంస్థ లాసా రూ.1,142.05 కోట్లతో రూపొందించిన డీపీఆర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఆర్‌డీఏ అధికారులు టెండర్లు పిలవటానికి సన్నాహాలు చేస్తున్నారు. రాజధాని పునర్నిర్మాణ పనులతో పాటే ఈ రాచమార్గాల పనులను కూడా ఒకేసారి ప్రారంభించేందుకు వీలుగా టెండర్లను పూర్తిచేసి ఎల్‌వోఏలు ఇవ్వాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. రాజధానికి ప్రధానమైన సీడ్‌యాక్సెస్ రోడ్డును ఎన్‌హెచ్-16కు అనుసంధానం చేయాలని ప్రభుత్వం మొదట నిర్ణయించింది. దీనితోపాటు ఈ-11, ఈ-13, ఈ-15 రోడ్లను కూడా ఎన్‌హెచ్-16కు అనుసంధానించాలని భావించింది. డీపీఆర్‌లు రూపొందించాల్సిందిగా లాసా కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించింది. ఈ మూడింటికి మిగతా 4లో..

**అమరావతి ప్రధాన రహదారుల పనులకు టెండర్ల ఖరారు** 6లో

## నేటి నుంచి ఒంటిపూట బడులు

- ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు
- డీఈవో పి.వి.జె.రామారావు

మచిలీపట్నం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.వి.జె. రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పనిచేస్తాయని చెప్పారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఉండే 145 పాఠశాలలు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేయనున్నాయని వివరించారు. పాఠశాలల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఫ్యాన్లు అన్నీ పనిచేసేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

## కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో అవినీతిపై సీఐడీ విచారణ కోరతాం

- బాధిత కార్మికులకు ఎమ్మెల్యే వెనిగండ్ల భరోసా 4లో



తిరుపతమ్మ,గోపయ్య

## ● బోనాల పండుగ

### తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు ప్రారంభం

పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ చిన్న తిరునాళ్లు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు.. మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. 4లో



బోనాలతో తరలివచ్చిన భక్తులు

## రంజాన్ వేళలు



ఇఫ్తార్ (సాయంత్రం): 06-21(శని)
సహర్ (ఉదయం): 04-56 (ఆది)

# భక్తి పరవశంతో.. దుర్గమ్మ గిరి ప్రదక్షిణ



గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణ




ఇంద్రకీలాద్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం ఫాల్గుణ పౌర్ణమి నాడు గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణ భక్తితో సాగింది. ఉదయం ఉత్సవమూర్తులకు మేళతాళాలతో ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, గుమ్మడికాయ దిష్టితీయగా.. డిప్యూటీ ఈవో రత్నరాజు, ముఖ్యఅర్చకుడు శ్రీనివాసశాస్త్రి, స్థానాచార్యుడు శివ ప్రసాద్ శర్మ, ఆలయ ఉద్యోగులు, భక్తులు జై భవానీ, జైజై భవానీ అంటూ గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, భజనల మధ్య అమ్మవారి గిరిప్రదక్షణ బయలుదేరింది. కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా బయలుదేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. వందలాది భక్తులు పాల్గొన్నారు.

● కనకదుర్గమ్మ గిరిప్రదక్షణ సమయంలో గరికపర్రు నుంచి వచ్చే డప్పు వాయిద్యాలు శుక్రవారం కనిపించలేదు. కాగా, మూడునెలల నుంచి వారికి పారితోషకం ఇవ్వటం లేదని చెబుతున్నారు. డప్పుల వాయిద్యాలు ఉంటేనే గిరిప్రదక్షిణకు నిండుదనం ఉంటుంది. డప్పులు వాయించటంతో పాటు నృత్యం చేస్తూ ఒకరిపై ఒకరు నిలుచుని విన్యాసాలు చేస్తారు. ఇవన్నీ భక్తులను ఆకట్టుకునే అంశాలు. సన్నాయి మేళాలు కొంత వరకు మాత్రమే వచ్చి వెనుదిరుగుతున్నైనం. ఈ లోటును దేవస్థానం పరిశీలించి సరిదిద్దాలని భక్తులు కోరుతున్నారు.

### ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ..

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాలు సమర్పించి, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. పౌర్ణమి సందర్భంగా కనకదుర్గమ్మ స్వర్ణకవచంతో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు పొంగళ్లు సమర్పించారు. భక్తుల రద్దీ పురస్కరించుకుని తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు.



విద్యుత్ కాంతులలో తిరుపతమ్మ ఆలయం

# వైభవంగా తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు ప్రారంభం

పెనుగంచిప్రోలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాలు మాఘ శుద్ధపౌర్ణమి శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారికి ఆలయ డిప్యూటీ కమిషనర్ బి.హెచ్.వి.ఎస్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అఖండ దీపాన్ని వెలిగించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. తొలి బోనాలు ఆలయ స్థల దాత చింతయ్య వంశీకులు గ్రామానికి చెందిన మాదిగ కులస్థులు సమర్పించారు. తూర్పు బజారు మాదిగ పల్లి నుంచి సుమారు 1000 మంది మహిళలు, వృద్ధులు, యువకులు బోనాలను నెత్తిన పెట్టుకొని మేళతాళాలు మంగళ వాయిద్యాలు, కనకతప్పెట్లతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించి అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలను చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు బెజవాడ శ్రీనివాసరావుతో పాటు మాదిగ కుల ప్రముఖులు, పెద్ద సంఖ్యలో సంఘీయులు పాల్గొన్నారు. భక్తులు మునేటిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తహసీల్దార్ శాంతిలక్ష్మి, ఈఈ ఎల్.రమ, పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, పంచాయతీ కార్యదర్శి జి.శ్యామ్‌కుమార్‌లు పారిశుధ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. విజయవాడ సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆశీర్వచనం చేసి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. మేడ్చెల్ జిల్లా ఘట్‌కేసరి మండలం అయిషాపూర్ గ్రామానికి చెందిన సంకూరి హనుమంతరావు - లలిత దంపతులు అమ్మవారికి రూ.50 వేలు, మణుగూరుకు చెందిన గురిజాల గోపి రూ.50 వేలు విలువగల వస్త్రాలను ఆలయ మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. నందిగామ డివిజన్ గ్రామీణ వైద్యుల సంక్షేమశాఖ ఉచితంగా మందులను అందజేయగా.. శాంతిభద్రతలకు విఘాతం లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



తిరుపతమ్మ సేవలో విజయవాడ సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి దంపతులు



తిరుపతమ్మ అమ్మవారికి బోనాలు చెల్లిస్తున్న పెనుగంచిప్రోలు మాదిగ సంఘీయులు

# ఏపీలో అభివృద్ధి సంస్కరణలు భేష్

» ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను సందర్శించిన తెలంగాణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత



ఏపీలో ఆర్యవైశ్యులకు అందిస్తున్న సేవలను కాల్వ సుజాతకు వివరిస్తున్న డూండీ రాకేష్

వన్‌టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలు, సేవలు ఎంతో బాగున్నాయని, ఇదే తరహాలో తెలంగాణలోనూ అమలు చేయటానికి త్వరలోనే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలను కలిసి వివరిస్తానని తెలంగాణ ఆర్యవైశ్య అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత అన్నారు. శుక్రవారం ఆమె పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ డూండీ రాకేష్, తదితర వైశ్య ప్రముఖులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ హయాంలో పేద, మధ్యతరగతి ఆర్యవైశ్యులు, చిరువ్యాపారులకు అందుతున్న సేవలను అభినందించారు. వీటిపై అధ్యయనం చేసి తమ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలను కలిసి మాట్లాడి కృషి చేస్తామని తెలిపారు. గడ్డం సత్యనారాయణ, వీవీకే నరసింహారావు, కె.ఎల్.వి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ నజీర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాంజీ

## గవర్నర్‌ను కలిసిన కేయూ ఉపకులపతి

మచిలీపట్నం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గవర్నర్, కృష్ణా విశ్వవిద్యాలయం చాన్సలర్ అబ్దుల్ నజీర్‌ను శుక్రవారం కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి రాంజీ మర్యాద పూర్వకంగా శుక్రవారం గవర్నర్ చాంబర్‌లో కలిశారు. పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన అనుమతులను గవర్నర్ ముందు ఉంచారు.

# కానూరులో లగ్జరీ లైఫ్ ముహూర్తపు షాట్



ముహూర్తపు షాట్ చిత్రీకరిస్తున్న చిత్ర బృందం

బెంజిసర్కిల్, మార్చి 14 ( ఆంధ్రజ్యోతి) : ఎన్ఎంఆర్ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న లగ్జరీ లైఫ్ చిత్రంపై పెనమలూరు మండలం కానూరులోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం శుక్రవారం ముహూర్తపు షాట్‌ను చిత్రీకరించారు. ఇది ఎంతో సందేశాత్మక చిత్రమని, కళాశాల విద్యార్థులు లగ్జరీ లైఫ్‌కు అలవాటుపడి ఎలా చెడిపోతున్నారు.. వీరివల్ల తల్లిదండ్రులు ఎలా బాధపడుతున్నారు అనే ఇదివృత్తంతో సినిమా తెరకెక్కనుందని డైరెక్టర్ మల్లేష్‌నాయుడు చెప్పారు. ప్రేమలో పడిన యువతీ యువకులు వ్యామోహపు మోజులో పడి మానవీయ విలువలను మరిచిపోతున్న పరిస్థితులను, వాస్తవ జీవితాలకు అద్దం పట్టే విధంగా ఈచిత్రాన్ని రూపొందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో యువశక్తి దేశానికి ఎంత అవసరం, మానవీయ విలువలను కాపాడటంలో వాటి పాత్రను తెలియజేసేలా సినిమా తీసున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల్లో ఈచిత్రం రూపొందించి మే 25నాటికి అన్ని షెడ్యూళ్లను పూర్తిచేయాలనే లక్ష్యంతో చిత్ర యూనిట్ పనిచేస్తుందని ఆయన వివరించారు.

# ప్రతిపాదనలతో సరి!

(3వ పేజీ తరువాయి)

సాగునీటిని విడుదల చేయలేదు. ప్రకాశం బ్యారేజీ ఎగువున నీటి నిల్వ సామర్థ్యం మూడు టీఎంసీలుగానే ఉండటంతో పూర్తిస్థాయిలో ఈ నీరు పంటలను కాపాడేందుకు సరిపోనిస్థితి ఏర్పడుతోంది.

### చోడవరం, బొబ్బర్లంక వద్ద బ్యారేజీలు

కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువున 16వ కిలోమీటరు తోట్లవల్లూరు మండలం చోడవరం వద్ద కృష్ణానదిపై బ్యారేజీ నిర్మాణానికి 2022-23 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం రూ.2,235.41కోట్లతో అంచనాలు రూపొందించారు. రెండో బ్యారేజీ ప్రకాశం బ్యారేజీకి దిగువున 67వ కిలోమీటరు మోపిదేవి మండలం బొబ్బర్లంక వద్ద రూ.2,526.39 కోట్లతో అంచనాలు తయారు చేశారు. 2023-24లోని ఎస్ఎస్ఆర్ రేట్ల ఆధారంగా చోడవరం వద్ద నిర్మాణం చేసే బ్యారేజీ అంచనాలను రూ.2,349.23 కోట్లకు, బొబ్బర్లంక వద్ద నిర్మాణం చేసే బ్యారేజీని 2,592.66 కోట్లకు అంచనాలను పెంచారు. ఈ పనులకు ఇప్పటి వరకు ఆమోదం లభించలేదు. టెండర్లు ఎప్పుడు పిలుస్తారు, పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియనిస్థితి నెలకొంది.

### 8.226 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా అంచనాలు

కృష్ణానదిపై చోడవరం వద్ద నిర్మాణం చేసే బ్యారేజీలో 4.131 టీఎంసీలు, బొబ్బర్లంక బ్యారేజీ వద్ద 4.095 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా నమూనాలను రూపొందించారు. బొబ్బర్లంక వద్ద నిర్మాణం చేసే బ్యారేజీ వద్ద నిల్వ ఉన్న నీటిని కష్టకాలంలో దివిసీమ ప్రాంతంలోని కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, తదితర మండలాల్లో సాగు, తాగు నీరుగా అందించాలని నిర్ణయించారు. నదిలో నీరు నిల్వ ఉంటే సముద్రపు పోటు సమయంలో ఉప్పునీరు కృష్ణానదిలో అధికంగా ఎగువ ప్రాంతానికి చొచ్చుకురాకుండా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. బొబ్బర్లంక వద్ద బ్యారేజీ నిర్మాణం చేస్తే భూగర్భ జలాలు పెరిగి కృష్ణానది పరివాహక ప్రాంతంలోని లంక భూముల్లోని బోర్లకు పూర్తిస్థాయిలో నీరు అంది పంటలు పండటానికి అవకాశం ఉంటుందని నిర్ధారించారు. వేసవిలో, ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సాగు, తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ఇక్కడ నిల్వ ఉన్న నీటిని వినియోగించుకోవచ్చని కూడా డీపీఆర్‌లో పొందుపరిచారు.

## రాజధానిలో శ్రీనివాసుడి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో శ్రీనివాసుడి కళ్యాణోత్సవం నిర్వహించడానికి టీటీడీ, జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు స్వామి వారి కల్యాణం జరుగుతుంది. ఆలయ ఆవరణలో భక్తులు కూర్చునేందుకు గ్యాలరీలు సిద్ధం చేశారు. సీఆర్డీఏ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు వెంకటపాలెం చేరేందుకు వీలుగా టీటీడీ దాదాపు 300 బస్సులు ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి వచ్చే వారి కోసం మందడంలో ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి అన్నమాచార్య సంకీర్తనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, స్వామి వారి కళ్యాణాన్ని ప్రారంభిస్తారు.

# అమరావతి రాజమార్గాలకు డీపీఆర్‌లు సిద్ధం

(3వ పేజీ తరువాయి)

సంబంధించి డీపీఆర్‌లు పూర్తయ్యాయి. ఈ-11 రోడ్డుకు సంబంధించి భూ ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో ఈ-13, ఈ-15 రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానించాలని నిర్ణయించారు. ఈ రాజమార్గాలను అభివృద్ధి చేయటానికి భూ సమీకరణ, భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) విధానాల్లో భూములు సేకరించవచ్చని లాసా సూచించింది.

### ఈ-13కు రూ.834.46 కోట్లు

అమరావతి ప్రధాన రాజమార్గం ఈ-13కు సంబంధించి రూ.834.46 కోట్లతో డీపీఆర్ పూర్తయింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ, అటవీ భూములతో కలిపి 38.42 ఎకరాలు, ప్రైవేట్ ఓపెన్ భూములు 9.97 ఎకరాలు, నిర్మాణాలతో కూడిన ప్రైవేట్ భూమి 5.58 ఎకరాలు, పక్కా నిర్మాణాలు-8, సెమీ పక్కా ఇళ్లు 31, కచ్చా ఇళ్లు 3 ఉన్నాయి. ఈ రాజమార్గం కొనసాగింపులో భాగంగా రైల్వే లైన్ క్రాస్ చేయాల్సి ఉండటంతో పీఎం గతిశక్తి ప్రాజెక్టు కింద ఆరు వరసల డివైడెడ్ ఆర్‌వోబీ నిర్మించాలని రైల్వేశాఖ మంత్రికి సీఎం చంద్రబాబు ఇటీవల లేఖ రాశారు.

ఈ-13 రోడ్డును ఎన్‌హెచ్-16కు కలవటానికి 7.29 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఇందులోనే ఆర్‌వోబీ కూడా ఉంటుంది. దీని అలైన్‌మెంట్ మంగళగిరి రిజర్వు ఫారెస్ట్ పరిధిలో 1.6 కిలోమీటర్ల మేర సాగుతుంది. గుంటూరు డివిజన్ పరిధిలో తాడేపల్లి రిజర్వు ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ 132లో 23.7 ఎకరాల అటవీ భూముల ల్యాండ్ కన్వర్షన్ కోసం చెన్నైలోని ఆర్వో కార్యాలయానికి ప్రతిపాదించారు.

### రూ.307.59 కోట్లతో ఈ-15

అమరావతి రెండో ప్రధాన రాజమార్గంగా ఈ-15ను 16వ నంబరు జాతీయ రహదారికి అనుసంధానం చే యడానికి వీలుగా రూ.307.59 కోట్లతో లాసా డీపీఆర్‌ను తయారు చేసింది. దీనిప్రకారం ప్రభుత్వ భూమి 24.98 ఎకరాలు, ప్రైవేట్ ఓపెన్ భూమి 3.52 ఎకరాలు, నిర్మాణాలతో కూడిన ప్రైవేట్ ఓపెన్ భూమి 7.18 ఎకరాలు, పక్కా నిర్మాణాలు 21, సెమీ పక్కా నిర్మాణాలు 76, కచ్చా నిర్మాణాలు 6 ఉన్నాయి. ఈ అలైన్‌మెంట్ పరిధిలోనూ రైల్వేలైన్ ఉన్నందున పీఎం గతిశక్తి కింద 6 వరసల డివైడెడ్ ఆర్‌వోబీని, ఫుట్‌పాత్‌లతో కలిపి నిర్మించాలని రైల్వే మంత్రికి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

# ముగ్గురి ఉసురు తీసిన అతివేగం

(3వ పేజీ తరువాయి)



కారులో ఇరుక్కుపోయిన పద్మావతి



ఘటనాస్థలంలో కోటే వరప్రసాద్

చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఘంటసాల ఎస్ఐ ప్రతాప్ రెడ్డి సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. లారీ ముందు భాగంలో ఇరుక్కుపోయి బొలెరో వాహనాన్ని జేసీబీ సహాయంతో బయటకు లాగారు. వాహనంలో ఇరుక్కుని ఉన్న మృతదేహాలను పోలీసులు అతి కష్టం మీద బయటకు తీసి అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. కాగా, జనసేన ఆవిర్భావ సభకు పిఠాపురం వెళ్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకుని సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి ప్రమాదానికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

## కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో అవినీతిపై సీఐడీ విచారణ కోరతాం

» బాధిత కార్మికులకు ఎమ్మెల్యే వెనిగండ్ల భరోసా

గుడివాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో నియోజకవర్గంలో జరిగిన అవినీతిని మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి సీఐడీ విచారణ చేపట్టాలని కోరనున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో 'ది గుడివాడ మున్సిపల్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ'లో 2022లో జరిగిన రూ.5కోట్ల కుంభకోణాన్ని సొసైటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సత్యనారాయణపురంలోని సొసైటీ కార్యాలయానికి వెళ్లి రుణాల అవకతవకలపై గుమాస్తా రాజును ఎమ్మెల్యే ప్రశ్నించగా.. తాను రూ.40లక్షలు సొంతానికి వాడుకున్నానని, సొసైటీ సభ్యుల పేరుతో తీసుకున్న రుణాల వివరాలు సొసైటీ అధ్యక్షురాలు లక్ష్మికి తెలుసునని గుమాస్తా రాజు పేర్కొన్నాడు. దీంతో కార్మికులు ఆందోళన చేపట్టగా వారికి ఎమ్మెల్యే నచ్చజెప్పారు. సొసైటీ అవినీతిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఒన్‌టౌన్ పోలీసులకు సూచించడంతో పాటు అవినీతిపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి విచారణ చేయిస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి సీఐడీ విచారణ కోరతానన్నారు. గుడివాడలో వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపిస్తామని.. బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన వెంట టీడీపీ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, కార్మిక సంఘ నాయకులు వడ్డాది నాగరాజు, నాయకులు చేకూరు జగన్మోహనరావు, గడ్డం ప్రకాష్‌దాసు, బాధితులు ఉన్నారు.



పికిల్ బాల్ కోర్టు ప్రారంభిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

## నగరంలో పికిల్ బాల్ కోర్టులు ప్రారంభం

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో రాబోయే రోజుల్లో 220 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ రానున్నాయని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. సిద్ధార్థ నగర్‌లో 'ది పికిల్ బాల్ రిపబ్లిక్' పేరుతో ఏర్పాటు చేసిన కోర్టులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరావతి స్పోర్ట్స్ సిటీలోనే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం కూడా నిర్మాణం జరుగుతుందని, స్పోర్ట్స్ యూనివర్సిటీకి ప్రభుత్వం 142ఎకరాలు కేటాయించిందని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, ఇటువంటి అకాడమీలతో ఎంతో మంది యువక్రీడాకారులు ఎదుగుతారని, పికిల్‌బాల్‌పై యువత ఆసక్తి చూపుస్తున్నారన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు కొద్దిసేపు పికిల్ బాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో నిర్వాహకులు వడ్లమూడి స్రవంతి, ప్రియ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# రంగు పడింది!

» హోలీ వేడుకల్లో ఆబాల గోపాలం



వన్‌టౌన్‌లో విద్యార్థుల కేరింత





పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్‌లో..

విజయవాడ(కల్చరల్), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : నగరం హోలీ వేడుకల్లో కళకళలాడింది. వన్‌టౌన్ ప్రాంతంలోని పలు వీధులు, లబ్బీపేట బబ్బూరి గ్రౌండ్స్, పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డులో రంగుల వాన కురిసింది. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రజలు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఉదయం నుంచే వీధుల్లో రంగుల పండుగ ప్రారంభమైంది. కుటుంబసభ్యులు, స్నేహితులు, చిరువ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. లబ్బీపేట బబ్బూరి గ్రౌండ్స్‌లో భారీ స్థాయిలో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. డీజేకు అనుగుణంగా స్టెప్పులు వేసి ఉత్సాహంగా గడిపారు. పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డులో ప్రజలు గ్రూపులుగా చేరి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. చిన్నారులు రంగుల పిచికారీలతో సందడి చేశారు.

### ఎన్టీటీపీఎస్‌లో సందడి చేసిన ఉద్యోగులు

డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో లావుడియా నరసింహనాయక్ అధ్యక్షతన హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ టి.నాగరాజు కేకు కట్ చేసి బంజారా సోదరులందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆటపాటలతో హోరెత్తించారు.



పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్‌లో..



కుటుంబసభ్యులతో ఉద్యోగుల ఆటాపాటా





గురునానక్ కాలనీలో..



ఎన్టీటీపీఎస్‌లో..

## ముగిసిన కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**విజయవాడ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** నున్నలో మూడు రోజులుగా జరుగుతున్న కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిసాయి. చివరి రోజు గ్రామ పురవీధుల్లో స్వామివార్ల రథోత్సవం జరిగింది. ముందుగా అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, రథంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు నృత్యాలు, కోలాట ప్రదర్శనలు చేశారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆలయంలో విశేషహోమాలు, పూర్ణాహుతి, కోలనులో త్రిశూలస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



## మహాలక్ష్మికి కుంకుమ పూజ

**ఉయ్యూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** గండిగుంట అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మహాలక్ష్మి అమ్మవారికి శుక్ర వారం ఎన్ కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాలక్ష్మి జన్మనక్షత్రం, హోలీ పూర్ణిమ పురస్కరించుకుని జరిగిన పూజా కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

## బాపులపాడు గ్రామసభ నేడు

**హనుమాన్‌జంక్షన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అంజన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర...స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజాభిప్రాయసేకరణకు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజానీకం సభకు హాజరై అభిప్రాయాలు తెలిపాలని కార్యదర్శి కోరారు.

## నేడు మండల సమావేశం

**ఉంగుటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** ఉంగుటూరు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 15న శనివారం మధ్యాహ్నం 2గంటలకు స్థానిక స్త్రీశక్తిభవనం మీటింగ్ హాలులో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కే.జోగేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలోని అన్నిగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

## వైభవంగా బూసిమ్మ తిరునాళ్ల

**ఉయ్యూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** ముదునూరులో బూసిమ్మ తిరునాళ్ల వైభవంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి అమ్మవారికి సర్పంచ్ మొవ్వ వెంకట నాగలక్ష్మి జ్ఞానశేఖర్ దంపతులు బోనాలు సమర్పించారు. తెలుగు యువత నాయకుడు దండమూడి చౌదరి, ఆళ్ల శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## శ్రామిక జన చైతన్యమే కారల్ మార్క్స్ ఏకైక లక్ష్యం

**కంకిపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** శ్రామిక జన చైతన్యమే కారల్ మార్క్స్ ఏకైక లక్ష్యమని సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు చిక్కవరపు శ్రీహరి అన్నారు. కారల్ మార్క్స్ 144వ వర్ధంతి సందర్భంగా ఉప్పలూరులోని కారల్‌మార్క్స్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ, మానవాళి ఏకత్వం కోసం కృషి చేసిన వ్యక్తి కారల్‌మార్క్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. చంటిబాబు, చిక్కవరపు వెంకటరెడ్డియ్య, ఉప్పలూరు ఆంజనేయులు, వెంగళ సీతారామయ్య పాల్గొన్నారు.

## పేకాడుతున్న 9 మంది అరెస్టు

**ఉయ్యూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** పెదఓగిరాలలో పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. 9మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 74,650, 7 మోటార్ వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఉయ్యూరు రూరల్ ఎస్సై సురేశ్‌బాబు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామని ఎస్సై హెచ్చరించారు.

## కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) :** రంగయ్యప్పారావుపేటలోని కోదండరామస్వామి దేవస్థానం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని అభివృద్ధి కమిటీ కోశాధికారి పరుచూరి సుకన్య అన్నారు. దేవస్థాన అభివృద్ధి నిమిత్తం పొట్లూరి వెంకటేశ్వరరావు రూ. 1,02,501, వారి అల్లుడు కేశినేని వెంకట రాజేష్, నళిని దంపతులు రూ.80వేల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి రాము, వీరపనేని రాజేశ్వరరావు, కొత్తపల్లి రామకృష్ణ, ధన కోటేశ్వరరావు, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో రాష్ట్రం ఛిన్నాభిన్నం

● వెల్‌నెస్ సెంటర్ కట్టేందుకు తొమ్మిదేళ్లు పట్టడం దురదృష్టకరం

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎంపీపీ రాజా

**కంకిపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం ఛిన్నాభిన్నం చేసిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లులో ప్రభుత్వం, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, గత వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేశారన్నారు. ఈడుపుగల్లు గ్రామంలో ఓ వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించటానికి 9 ఏళ్ల పట్టడం దురదృష్టకరమన్నారు. మండలంలోని మద్దూరు - ఉప్పలూరు రహదారిని నిర్మాణానికి సంబంధిత శాఖ మంత్రికి అనేక మార్లు విన్నవించుకున్నట్లు తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించి సుమారు రూ. 45 వేల కోట్ల మేరకు గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు బకాయిలు ఉన్నాయని వాటిని తీర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఒక్క ఈడుపుగల్లులో సుమారు రూ. 1.20 కోట్ల ఎన్ఆర్ జీఎస్ నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి సహకరించిన పర్వతనేని కోటేశ్వరరావు, పర్వతనేని శ్రీనివాసులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పందిపాటి ఇందిర, సీహెచ్‌సీ డైరెక్టర్ గరికిపాటి రవికిషోర్, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, చింతా కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ మాబు సుబాని, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, పార్టీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, పార్టీ నాయకులు రావి సురేష్‌బాబు, పుట్టకుంట రవి, కాకుళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు పొందిన సర్పంచ్ పందిపాటి ఇందిరను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఘనంగా సత్కరించారు. జిల్లాలోనే ఉత్తమంగా నిలిచారని, అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లారని సర్పంచ్ ఇందిరను ఎమ్మెల్యే బోడె కొనియాడారు.

### కలవపాములలో ప్రత్యేక పూజలు

**ఉయ్యూరు :** హోలీ పూర్ణిమ పురస్కరించుకుని కలవపాములలో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విశేషపూజలు చేశారు. మహన్యాస పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకం, అన్నా భిషేకం, సహస్ర కుంకు మార్చన, రుద్రహోమం చేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు.





క్యాంపస్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

## ఈ ఏడాది ఇక్కడే కొనసాగించాలి

● నిర్వహణ భారం నెపంతో క్యాంపస్ మార్చటం తగదు

● ఈడుపుగల్లు డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ గురుకులం ఐఐటీ మెడికల్ అకాడమీ క్యాంపస్ ఎదుట విద్యార్థుల ఆందోళన

**కంకిపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** తమను ఈ ఏడాది ఈ క్యాంపస్‌లోనే కొనసాగించాలని కోరుతూ ఈడుపుగల్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు శుక్రవారం క్యాంపస్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, 2016 సంవత్సరంలో పేద విద్యార్థినిల భవిష్యత్ కోసం గురుకులం ఐఐటీ మెడికల్ అకాడమిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేయియడం జరిగిందన్నారు. క్యాంపస్‌లో చదువుకున్న అనేక మంది విద్యార్థులు ఉత్తమ శిఖరాలను అధిరోహించారని, అయితే నిర్వహణ భారం అవుతుందనే నెపంతో ప్రస్తుతం ఉన్న క్యాంపస్‌ను మూసివేస్తూ ఇక్కడ ఉన్న సుమారు 600 మంది విద్యార్థులను ఇతర క్యాంపస్‌కు మారుస్తామంటూ ఉన్నతాధికారులు చెప్పటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమాచారం అందుకున్న గురుకులం ఐఐటీ అకాడమి కో ఆర్డినేటర్ ఎ. మురళీకృష్ణ కళాశాలకు చేరుకున్నారు. ప్రభుత్వం దృష్టికి విద్యార్థుల సమస్యను తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు తమ ఉద్యమాన్ని విరమించారు.

### విద్యార్థులకు సంఘీభావం తెలిపిన ఎస్ఎఫ్ఐ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ఐఐటీ మెడికల్ అకాడమిని ఈడుపుగల్లులోనే కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సమరం మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు నామమాత్రంగా నడుస్తున్నాయన్నారు. ఈడుపుగల్లులో నిర్వహిస్తున్న గురుకులం ఐఐటీ క్యాంపస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాడంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ఉంగుటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** ఈనెల 17నుంచి ఏప్రిల్ 1వరకు జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను ఉంగుటూరు మండలంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖాధికారి-2 జె.సాంబశివరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. తేలప్రోలు, ఆత్కూరు, ఉంగుటూరు, మానికొండ, ఇందుపల్లి ప్రభుత్వ జడ్పీహైస్కూళ్లతోపాటు పెదఅవుటపల్లి సెయింట్‌జార్జి హైస్కూల్, ఆత్కూరు జీఎంఆర్ హైస్కూల్ కలిపి మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా 15 ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్ల నుంచి మొత్తం 625మంది విద్యార్థులు ఈ ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్, టాయిలెట్లు, ఫ్యాన్లు, లైట్లు, బెంచ్‌లు, తదితర వసతులు కల్పించామని తెలిపారు.

## వైభవంగా అయ్యప్పస్వామి పూజ

వైద్యశిబిరాన్ని ప్రారంభించి పూజలో పాల్గొన్న జేడీ లక్ష్మీనారాయణ



పూజలో పాల్గొన్న సీబీఐ మాజీ చీఫ్ జేడీ లక్ష్మీనారాయణతో పాటు వైస్ ఎంపీపీ చందు రమాదేవి దంపతులు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) :** కోడూరుపాడులో అయ్యప్పస్వామి పూజ శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కె.మురళీధరన్ నంబూద్రి (కేరళ నంబూద్రి) ఆధ్వర్యంలో తెల్లవారుఝామున వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతులు శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. అయ్యప్పస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో సెంటిని సిటీ హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్యశిబిరాన్ని సీబీఐ మాజీ చీఫ్ జేడీ లక్ష్మీనారాయణ ప్రారంభించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కేరళ వాయిద్యాల నడుమ అయ్యప్పస్వామి వారికి పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని గుర్రాల రథంపై ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు.

● సెంటిని సిటీ హాస్పిటల్ డాక్టర్ అనిల్‌కుమార్ నరాలశెట్టి, డాక్టర్ నవీన్ తోట, డాక్టర్ సాంబశివరావు చందు ఆధ్వర్యంలోని వైద్యబృందం 231 మందికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి 2డీ ఎకో లాంటి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. చందు గణేష్, మోర్ల ఆంజనేయులు, భాను, జయప్రకాష్, యమగోల గురుస్వామి తదితరులు పర్యవేక్షించారు.

## ఆవిర్భావ దినోత్సవం పార్టీ బలోపేతానికి స్ఫూర్తి



జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు జంక్షన్ నుంచి పిఠాపురం వెళ్తున్న వీరమహిళలు

**హనుమాన్‌జంక్షన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పిఠాపురంలో ఆవిర్భావ దినోత్సవం జరుపు కోవడం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని బాపులపాడు మండల వీర మహిళలు సింగవరపు సూర్యవతి, జయరాణి తెలిపారు. శుక్రవారం పిఠాపురంలో నిర్వహించిన జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు బాపులపాడు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తరలి వెళ్లారు. నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అహమ్మద్ రెండు రోజులు ముందే చేరుకున్నారు. శుక్రవారం సూర్యవతితో పాటు పలువురు వీర మహిళలు, కార్యకర్తలు వెళ్లారు. వీర మహిళ ప్రసన్న, నాయకులు రామిశెట్టి ప్రసాద్, పుప్పాల నాగేశ్వరరావు, పల్నాటి చంటి తదితరులు ఉన్నారు.





గన్నవరం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో .. ఉయ్యూరులో..

## ఘనంగా హోలీ వేడుకలు

**గన్నవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** మండలంలో హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు కేవీఆర్ కిషోర్, వాకర్స్ ఒకరికొకరు రంగులు చల్లుకుని సందడిగా హోలీ సంబరాలు చేసుకున్నారు. పర్యావరణ హితమైన రంగులు చల్లుకున్నారు. సీనియర్ సిటీజన్స్‌తో పాటు మహిళా వాకర్స్ కూడా ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. గౌరవ సలహాదారు తిరివీధి వెంకయ్య, వేమూరి ఏంజల్ విజయ్‌కుమార్, కెఎస్ బాబూరావు పాల్గొన్నారు. సూరంపల్లి, వీరపనేనిగూడెం, కేసరపల్లి, ముస్తాబాద హోలీ వేడుకలు జరుపుకున్నారు.

**ఉయ్యూరు :** ఉయ్యూరులో హోలీ పండుగ చిన్నా పెద్దా తేడాలేకుండా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాల వద్ద నివాస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో చిన్నారులు హోలీ పండుగ చేసుకుని రంగులతో ముంచెత్తారు. కాకాని గిరిజన కాలనీ, సుగాలీ కాలనీలో హోలీ పండుగ వైభవంగా నిర్వహించారు. మహిళలు హోలీ ఆడుతూ నృత్యాలు చేశారు.

## ఉపాధి పనుల పరిశీలన

**గన్నవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** ఉపాధి హామీ పథకానికి పాలకులు తూట్లు పొడుస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు ఆరోపించారు. మండలంలోని బుద్ధవరం, దావాజీగూడెం, అల్లాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, పాలకులు చిత్తశుద్ధితో పేదలకు వరంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. నీరుగార్చేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కనీస సౌకర్యాలు కూడా కల్పించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పని కూలీలకు రోజుకు రూ.700 ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు కొండా వీరాస్వామి, తిరివీధి సుబ్బారావు, గోపీ, రంగమ్మ, పాపమ్మ, నాగేశ్వరరావు, మరియమ్మ పాల్గొన్నారు.

## రాణి అహిల్యాబాయి ఆశయాలు స్ఫూర్తిదాయకం

**హనుమాన్‌జంక్షన్ / గన్నవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :** సామాజిక మహిళా సాధికారతకు రాణి అహిల్యాబాయి చేసిన కృషి చిరస్మరణీయమని సమరసత ఫౌండేషన్ రీజనల్ సంయోజిక్ రాజా రామచంద్ర అన్నారు. శుక్రవారం బాపులపాడు దాసాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో రాణి అహిల్యాబాయి త్రి శతాబ్ది జయంత్సోవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమరసత వేదిక గన్నవరం ఖండ సంయోజిక్ యడవల్లి పాండురంగారావు, వేదిక నాయకులు కె.రామకృష్ణ, నారాయణరావు, దుర్గాప్రసాద్, ఎదురువాడ శ్రీనివాసరావు, వడ్డిల్లి లక్ష్మి, మొవ్వా రాజా పాల్గొన్నారు.

●గన్నవరం మండలం అల్లాపురం సాయిబాబా మందిరంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పుణ్య శ్లోక లోక మాత అహిల్యాబాయి త్రి శతాబ్ది ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సమరసత వేదిక ప్రాంత సంయోజక్ రాజా రామచంద్ర మాట్లాడుతూ, దేశమంతా వేడుకలు జరుగుతున్నాయన్నారు. ఆలయ అర్చకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం

# జనసేన



మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

## పవనుడు అందరివాడు..





పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

## జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

## పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**9 చోట్లా ఇంతే**

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

## మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..

## దివ్యాంగుల అభ్యున్నతే ధ్యేయం

- విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీలో ఎంపీ కేశినేని చిన్ని



విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ

మొగల్రాజపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని, వారి అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కేంద్ర ప్రభుత్వ అలింకో సంస్థ సహకారంతో ఎంపీ ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో నగరంలోని మూడు నియోజకవర్గాలకు చెందిన 715 మందికి బ్యాటరీ ట్రైసైకిళ్లు, ట్రై సైకిళ్లు, చంక కర్రలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలు, క్యాలిపర్స్, ఎంఎస్ఐడీ కిట్లు, రోల్లేటర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పట్టించుకోలేదని, మూడున్నరేళ్లుగా ఎంపిక చేసిన వారికి ఉపకరణాలు ఇవ్వలేదని ఎంపీ విమర్శించారు. కేంద్రం 2022లో ఉపకరణాలకు జాబితా ఇస్తే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబుతో చెప్పి కలెక్టర్, జిల్లా అధికారులతో కలిసి కేంద్రం మంజూరు చేసిన పరికరాలను రెండు నెలల క్రితం హైదరాబాద్ నుంచి తెప్పించామని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ కోడ్ కారణంగా పంపిణీ ఆలస్యమైందన్నారు. ఎంపీ కేశినేని చిన్ని చొరవతోనే ఉపకరణాల పంపిణీ జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు పనిచేస్తున్నామని, అందుకు ఎంపీ కేశినేని చిన్ని చొరవతో ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఏపీ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్‌స్ట్రక్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఎన్టీఆర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, అలింకో సంస్థ ప్రతినిధి రవిశంకర్ పాల్గొన్నారు.

### జనాభా ప్రాతిపదికన మాదిగలకు 1.8,
## మాలలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- ఏకసభ్య కమిషన్ మాదిగలకు ఆరున్నర, మాలలకు ఏడున్నర శాతం ఇవ్వాలని ప్రతిపాదించడాన్ని ఖండిస్తున్నాం: మాల సంఘాల నేతలు

గాంధీనగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'జనాభా ప్రాతిపదికన మాదిగలకు 1.8 శాతం, మాలలకు 10 శాతం రిజర్వేషన్లు రావాలి. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రెల్లి కులానికి ఒక శాతం, మాదిగలకు ఆరున్నర శాతం, మాలలకు ఏడున్నర శాతం ఉప రిజర్వేషన్లను ప్రతిపాదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.' అని మాల సంఘాల నేతలు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. జనాభా గణనలో మాల, ఆది ఆంధ్రులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా వర్గీకరణ చేయాలన్నారు. 1971 నుంచి 2011 వరకు జనాభా లెక్కల్లో అనేక అక్రమాలు జరిగాయని తెలిపారు. 1971లో మాదిగల కంటే మాలల జనాభా 10,06,043 ఎక్కువ ఉందని 2011 నాటికి మాదిగల కంటే మాలల జనాభా 10,49,506 మాత్రమే ఎక్కువ ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 40 ఏళ్లలో మాలల జనాభాలో ఏ మాత్రం పెరుగుదల లేదన్నారు. ఏపీలో జరిగిన జనగణనలో మాలల జనాభాను ఉద్దేశపూర్వకంగానే తగ్గించినట్టు స్పష్టమవుతోందని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నూతలపాటి జగదీష్, అనిల్ కుమార్ అంబటి, అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్, ఏపీ మాల ఉద్యోగుల సంఘం కోశాధికారి వై.శ్యామ్‌కుమార్, ఇండియన్ లేబర్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ముద్ద అంకయ్య, ఏపీ మాల ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు బేతాళ సుదర్శనం, సయ్యద్ భావన తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి ప్రధాన రహదారుల పనులకు టెండర్ల ఖరారు

- హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ నిధులతో 24 ప్యాకేజీల్లో ప్రధాన రోడ్లకు టెండర్లు
- ఎల్-1గా నిలిచిన సంస్థల వివరాలను ప్రకటించిన సీఆర్‌డీఏ
- కాంట్రాక్టు సంస్థలకు ఎల్‌వోఏలు ఇచ్చేందుకు సీఆర్‌డీఏ సన్నాహాలు

విజయవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రధాన రహదారుల పనులను పరుగులు పెట్టించేందుకు హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ నిధులతో చేపట్టే 24 ప్యాకేజీ పనులకు టెండర్లను సీఆర్‌డీఏ అధికారులు ఖరారు చేశారు. ప్రధాన రోడ్లకు పిలిచిన టెండర్లలో ఎల్-1గా నిలిచిన సంస్థలను సీఆర్‌డీఏ అధికారులు ప్రకటించారు. హడ్కో నుంచి తీసుకునే రూ.11 వేల కోట్ల రుణం, కేఎఫ్‌డబ్ల్యూ నుంచి తీసుకునే రూ.5 వేల కోట్ల రుణం మొత్తం రూ.16 వేల కోట్ల రుణంలో భాగంగా చేపట్టే పనుల్లో రోడ్ల పనులు కూడా ప్రధానమైనవి. హడ్కో చైర్మన్‌ను సీఆర్‌డీఏ అథారిటీలో సభ్యుడిగా నియమించేందుకు ప్రభుత్వం అనుమతి తెలిపినట్టు తెలుస్తోంది. తమ నిధులతో చేసే పనులను హడ్కో సమీక్షించటానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది. హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ నిధులతో రాజధానిలో ఈ-6, ఈ-5, ఈ-7, ఈ-11, ఈ-13, ఈ-15, ఎన్-13, ఈ-2, ఈ-4, ఎన్-8, ఎన్-4, ఈ-10, ఈ-12, ఎన్-7, ఎన్-10, ఎన్-14, ఎన్-16, ఎన్-17, ఈ-3(ఫేజ్-2), ఈ-16, ఎన్-1, ఎన్-2, ఎన్-3ఏ, 3బీ, ఎన్-5 రోడ్లకు పిలిచిన టెండర్లలో బడా సంస్థలు టెండర్లు వేశాయి.

### ఎల్-1గా నిలిచి రోడ్ల పనులకు టెండర్లు దక్కించుకున్న సంస్థలు

- ఈ-6 రోడ్డు పనులకు ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్ సంస్థ రూ.337.28 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-5 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.562.28 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-7 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.369.38 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-11 రోడ్డు పనులకు మేఘా సంస్థ రూ.156.92 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-13 రోడ్డు పనులకు ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్ సంస్థ రూ.207.85 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-15 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.194 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-13 రోడ్డు పనుల టెండర్లకు ఆర్‌వీఆర్ సంస్థ రూ.254.10కోట్లకు బిడ్‌నుకోట్ చేసింది.
- ఈ-2 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.157.47 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-4 రోడ్డు పనులకు మేఘా సంస్థ రూ.515.53 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-8 రోడ్డు పనులకు ఎన్‌సీసీ సంస్థ రూ.605.04 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-4 రోడ్డు పనులకు బీఎస్‌సీపీఎల్ సంస్థ రూ.246.41 కోట్లకు కోట్ చేసింది.
- ఈ-10 రోడ్డు పనులకు మేఘా సంస్థ రూ.295.84 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-12 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.255.60 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-7 రోడ్డు పనులకు ఆర్‌వీఆర్ సంస్థ రూ.453.92 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-14 రోడ్డు పనుల టెండర్లకు ఆర్‌వీఆర్ సంస్థ రూ.252.73 కోట్లకు కోట్ చేసింది.
- ఎన్-16 రోడ్డు పనులను బీఎస్‌సీపీఎల్ సంస్థ రూ.191.92 కోట్లకు కోట్ చేసింది.
- ఎన్-17 రోడ్డు పనుల టెండర్లను బీఎస్‌సీ సంస్థ రూ.186.74 కోట్లకు కోట్ చేసింది.
- ఈ-3 (ఫేజ్-2) రోడ్డు పనులను ఎన్‌సీసీ సంస్థ రూ.188.45 కోట్లకు కోట్ చేసింది.
- ఈ-16 రోడ్డు పనులకు ఎన్‌సీసీ సంస్థ రూ.141.45 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-1 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.125.08 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-2 రోడ్డు పనుల టెండర్లలో బీఎస్ఆర్ సంస్థ రూ.111.84 కోట్లకు కోట్ చేసింది.
- ఎన్-3ఏ, 3బీ రోడ్ల పనుల టెండర్లలో బీఎస్‌సీపీఎల్ సంస్థ రూ.154.75 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-5 రోడ్డు టెండర్లలో ఎన్‌సీసీ సంస్థ రూ.70.63 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.

### విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా
## అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- ధర్నాచౌక్‌లో విశాఖ ఉక్కు పరిరక్షణ జేఏసీ ధర్నా

ధర్నాచౌక్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ పరిరక్షణ కోసం ఎన్నికల సమయంలో కూట మి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ మోసపూరితమని, ప్లాంట్‌కు సొంత గనులు, నిర్వహణ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా జరిగింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయరాదని అసెంబ్లీలో తీర్మానించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కేంద్రప్రభుత్వం నిధులు కేటాయించిందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ నిధులు కేవలం బకాయి వేతనాలు చెల్లించడానికే సరిపోతాయన్నారు. విశాఖ ఉక్కు రక్షణ కోసం ప్రజలు, ట్రేడ్ యూనియన్లు దీర్ఘకాలంగా పోరాడుతున్నా పట్టించుకోకుండా అనకాపల్లిలో మరో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ మిట్టల్ కంపెనీకి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడాన్ని తప్పుబట్టారు. రాజకీయలకు అతీతంగా విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, జేఏసీ చైర్మన్ సీహెచ్ నర్సింగరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావుల రవీంద్రనాథ్ మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతరేక ఉద్యమానికి తమ మద్దతు ప్రకటించారు.

## పిల్లల్ని నీటిలో ముంచి హత్య చేసిన తండ్రి

- అనంతరం ఉరేసుకుని ఆత్మహత్య.. కాకినాడలో దారుణం

సర్పవరం జంక్షన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్నతండ్రే కాలయముడయ్యాడు. ఇద్దరు చిన్నారుల్ని నీటిలో ముంచి హత్య చేసి, ఆపై ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం శుక్రవారం కాకినాడలో జరిగింది. కాకినాడ నగరం తోట సుబ్బారావునగర్‌లో నివాసం ఉంటున్న వానపల్లి చంద్రకిషోర్ వాకలపూడిలో ఓఎన్జీసీలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. హోలీ వేడుకల్లో పాల్గొనేందుకు భార్య, ఇద్దరు కుమారులు జోషిల్ (7), నిఖిల్ (6)ను కార్యాలయానికి తీసుకెళ్లాడు. అనంతరం కుమారులను యూనిఫామ్ కొలతల కోసం టైలర్ వద్దకు తీసుకు వెళుతున్నానని భార్యకు చెప్పి ఇంటికి వెళ్లాడు. అక్కడ పిల్లల కాళ్లు, చేతులు కట్టేసి బకెట్‌లో నీటిలో ముంచి ఊపిరాడకుండా చేసి హత్యచేశాడు. అనంతరం బెడ్‌రూమ్‌లోకెళ్లి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోటీ ప్రపంచంలో తన పిల్లలకు భవిష్యత్తు లేదని, అందుకే వారిని చంపి తానూ మరణిస్తున్నట్టు చంద్రకిషోర్ సూసైడ్ నోట్‌లో రాసి ఉంచాడు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుమల చేరుకున్న ఏకసభ్య కమిషన్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి' తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య న్యాయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి శుక్రవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. శ్రీవారి దర్శనానికి భక్తులు వెళ్లే క్యూలైన్ల నిర్వహణ తీరును శని, ఆదివారాల్లో ఆయన పరిశీలించనున్నారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు టీటీడీ, పోలీసు, రెవెన్యూతో పాటు తొక్కిసలాటలో గాయపడిన 16 మందిని విచారించనున్నారు. ఇప్పటికే 17న హాజరు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈవో శ్యామలరావు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు నోటీసులు పంపారు. ఇక 18 నుంచి బదిలీ, సస్పెండైన అధికారులతో పాటు పలువురిని ఆరురోజుల పాటు విచారించి, వాంగ్మూలం స్వీకరించనున్నారు. ఈ మూడో దశ విచారణ అత్యంత కీలకంగా మారనుంది.





యూటీఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

## ప్రభుత్వ బడిని బతికించుకుందాం

- విద్యార్థులను చేర్పించే ప్రక్రియను ప్రారంభించండి
- తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా పనిచేయండి
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఉపాధ్యాయులకు వక్తల పిలుపు

గవర్నర్‌పేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ బడి పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా పనిచేసి, ప్రభుత్వ బడులను బతికించుకోవడానికి కృషి చేయండి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే ప్రక్రియను ప్రారంభించండి.' అని ఉపాధ్యాయులకు రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీ రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో విద్యారంగ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ ప్యానెల్ అధ్యక్షులుగా వ్యవహరించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యారంగ సంస్కరణల పేరుతో తెచ్చిన జీవో నెంబరు 117 కారణంగా 12,512 ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని, 10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు తరలిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల డిమాండ్ వల్ల జీవోను రద్దు చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జీవో నెంబరు 117 రద్దు చేసి మరో జీవో తేవడం కోసం చేస్తున్న కసరత్తులో విద్యారంగ సంస్కరణలు అమలు చేస్తోందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. విద్యారంగ సంస్కరణల వల్ల 1, 2 తరగతులు మాత్రమే ఉన్న ఫౌండేషన్ పాఠశాలలు 20 వేలకు పైగా పెరుగుతాయని తెలిపారు. భవిష్యత్తులో ఈ పాఠశాలలూ మూసివేస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల పేరుతో మిగిలిన ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను మ్యాప్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా బలవంతంగా తీర్మానాలు చేయించడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అన్ని హంగులతో మోడల్ పాఠశాలను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. తీసుకున్న నిర్ణయాలను విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యేలు, గ్రామ సర్పంచ్‌లు, విద్యాకమిటీ సభ్యుల వరకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసన్న, అశోక్, యూటీఎఫ్ కార్యదర్శులు ఎస్పీ మనోహర్‌కుమార్, బి.సుభాషిణి, కేఏ ఉమామహేశ్వరరావు, ఎస్.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

### విశాఖపట్నం-చర్లపల్లి మధ్య
## హోలీ ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే హోలీ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోలీ రద్దీ నేపథ్యంలో ఈ రైళ్లను చర్లపల్లి-విశాఖపట్నం మధ్య అప్ అండ్ డౌన్ సర్వీసులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ విశాఖపట్నం-చర్లపల్లి రైలు(నెంబరు 08579) సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరి, మరునాడు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈనెల 17వ తేదీ చర్లపల్లి-విశాఖపట్నం రైలు(నెంబరు 08580) ఉదయం 10 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతాయి.

### బ్రాయిలర్ ధరలు

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్‌బర్డ్ | 90, 97, 107 |
| చికెన్ విత్ స్కిన్ | 170 |
| చికెన్ స్కిన్‌లెస్ | 180 |



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

### చిన్నారుల కేరింతలతో హోలీ వేడుకలు

కూచిపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలను చిన్నారుల కేరింతలతో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పెదపూడి, కూచిపూడి, మొవ్వ తదితర గ్రామాల్లో హోలీ వేడుకలు చిన్నలు, పెద్దలు ఒకరికొకరు రంగులు పూసుకుని రంగునీళ్లు చల్లుకుంటూ ఉల్లాసంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.



హోలీ వేడుకల్లో చిన్నారులు



సువార్త సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

### క్రీస్తు బోధనలు అనుసరణీయం

పమిడిముక్కల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఏసుక్రీస్తు చూపిన మార్గం అనురసరణీయమని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. తాడంకి గాస్పెల్ రక్షణ మందిరంలో నిర్వహించిన క్రీస్తు సువార్త సభలో గురువారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాస్పెల్ రక్షణ మందిరం నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకుడు జక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వసంతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

### ఘనంగా వసంతోత్సవం

కూచిపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా భక్తులు ఆనందోత్సాహాల నడుమ వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా నిత్య అవపోసన, బలిహరణ, పూర్ణాహుతి, శేషవాహనంపై స్వామికి గ్రామోత్సవంతోపాటు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయం : వెనిగండ్ల

నందివాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా గ్రామ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పొలుకొండ, శంకరంపాడు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. పొలుకొండలో మాజీ ఎంపీటీసీ ఉప్పల వెంకటేశ్వరరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు కురమ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల టీడీపీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్థులు పనికి ఆహార పథకం కార్డులు లేవని వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మండల ఏపీవో దేవానందరాజుతో మాట్లాడి మండలాల వారీగా అర్హత గల వారందరికీ పనికి ఆహార పథకం కార్డులు అందజేయాలన్నారు. అనంతరం గ్రామస్థులు రోడ్లు, శ్మశాన వాటికను మెరక చేయించాలని కోరారు. మట్టి రోడ్లకు గ్రావెల్ వేఇంచాలని, వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించాలని ఎమ్మెల్యే ఎదుట ఏకరువు పెట్టారు. ఈ సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు. రోడ్ల మరమ్మతులకు కావాల్సిన గ్రాంట్లు వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం శంకరంపాడులో వెనిగండ్ల గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడి గ్రామసమస్యలు వెంటనే తన దృష్టికి తెలియపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మానేపల్లి రూన్సీ కుమారి, డీసీసీ మాజీ అధ్యక్షులు బొర్రా సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షులు బొమ్మనబోయిన ఏసుబాబు, చాట్రగడ్డ రవి, అందుగుల ఏసుపాదం, గొట్టుముక్కల బోసురాజు, చినబాబు, శ్రీనివాసరావు, ఏసు, వెంకటేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పొలుకొండ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

### మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

పమిడిముక్కల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పమిడిముక్కల మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యాలయ సభా మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో డి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపీటీసీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

### టీడీపీ నేతల సర్వసభ్య సమావేశం నేడు

నందివాడ: నందివాడ మండల టీడీపీ నాయకులకు గ్రామ సర్పంచ్‌లకు గ్రామాల పార్టీ నాయకులకు నందివాడ కో-ఆపరేటివ్ బ్యాంక్ వద్ద శనివారం సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల టీడీపీ నాయకులు దానేటి సన్యాసిరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొంటారన్నారు.

### విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

పమిడిముక్కల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాపురం సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతుల నిర్వహణ కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు శనివారం ఉదయం 7గంటల నుంచి 9 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. గోవిందరావు తెలిపారు.

## లబ్ధిదారులకు ఆర్థిక సాయంపై అవగాహన

● పామర్రు హౌసింగ్ ఏఈ పెదపూడి పవన్ కల్యాణ్

పామర్రు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ లబ్ధిదారులకు ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు మండలంలోని ప్రతి ప్రభుత్వగృహ లబ్ధిదారుని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థికసాయం గురించి వివరించే బాధ్యత గ్రామసచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఉందని పామర్రు హౌసింగ్ ఏఈ పెదపూడి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మండలవ్యాప్తంగా గల 17 గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులతో శుక్రవారం పోన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గృహ లబ్ధిదారుని ఇంటికి వెళ్లి గృహనిర్మాణం కోసం ప్రభుత్వం అందించనున్న అదనపు ఆర్థిక సాయం గురించి తెలపాలని ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలను సంబంధిత లాగిన్‌లో పొందుపరచి వాటితో జియోటాగింగ్‌చేసి, అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రధానమంత్రి అవాస్ యోజన1.0 గ్రామీణ గృహ నిర్మాణంద్వారా 208గృహాలు మంజూరైనట్టు చెప్పారు. లబ్ధిదారులకు గతంలో ఒక యూనిట్‌కు రూ1.80లక్షలు ఇచ్చేదన్నారు. ప్రస్తుతం వీటికి అదనంగా ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు, చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు ఒకయూనిట్‌కు రూ.50వేలు పెంపుతో రూ.2.30లక్షలు అందుతాయన్నారు. అలాగే ఎస్టీ లబ్ధిదారులకు ఒక్కో యూనిట్‌కు రూ. 75వేల పెంపుతో రూ.2.55లక్షలు అందుతాయని వివరించారు. రాబోయే జూన్‌మాసం చివరిలోగా నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించే విధంగా సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు తమ సేవలందించాలని కోరారు.

## పకడ్బందీగా పది పరీక్షలకు ఏర్పాట్లు : ఎంఈవో

పామర్రు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): సోమవారంనుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పామర్రు ఎంఈవో గుమ్మడి పద్మవాణి పేర్కొన్నారు. మండల కేంద్రమైన పామర్రు పోలీస్ స్టేషన్‌కు పదోతరగతి ప్రశ్నాపత్రాలు శుక్రవారం చేరుకున్నాయి. వాటిని సరిచూసుకుని స్టేషన్‌లో ప్రత్యేక పెట్టెల్లో పెట్టి సీళ్లు వేసి లాకప్‌లో భద్రపరచారు. ఈ సందర్భంగా ఎంఈవో విలేకరులతో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు పకడ్బందిగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పామర్రు మండలంలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలల్లో ప్రభుత్వ విద్యార్థులతో పాటు , వివిధ ప్రయివేటు పాఠశాలలనుంచి విద్యార్థులు హాజరు కానున్నట్టు చెప్పారు. విద్యార్థులకు తాగునీటితో పాటు, పరీక్షాకేంద్రంలో బెంచీలు, మెడికల్ సిబ్బంది ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షలకు కస్టోడియన్ అధికారిణిగా అడ్డాడ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మజను బోర్డు నియమించినట్టు చెప్పారు.



ప్రశ్నాపత్రాలు సరి చూసుకుంటున్న కస్టోడియన్ పద్మజ, ఇతర ఉపాధ్యాయులు

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపేయాలి : సీఐటీయూ

గుడివాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలిపి వేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆటోనగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన రూ.1500కోట్లు స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని విడనాడాలన్నారు. యూనియన్ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్, నాయకులు నాగరాజు, మొహిద్దీన్, మహదేవ, ఆదినారాయణ, వెంకటరమణ, ఐద్వా పట్టణ కార్యదర్శి పి.రజిని, పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

## ముగిసిన రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

కూచిపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నాట్యాచార్యులు దండిబొట్ల నారాయణ మూర్తి శిష్య బృందం నందిని, గీత, త్రివేణి, లిఖిత, సహస్ర, మనస్వి, హర్షితలు పలు అంశాలు ప్రదర్శించి ఔరా అనిపించారు. గురు కృప సంగీత నృత్య కళానికేతన్ డాక్టర్ పట్నం శివ ప్రసాద్ శిష్యబృందం ప్రదర్శించిన నాట్యాంశాలు కనువిందు చేశాయి. కళాకారులను డాక్టర్ రాధేశ్యామ్ మెమొంటోలు అందించి, ఘనంగా సత్కరించారు.



దండిభొట్ల నారాయణమూర్తి బృంద నాట్యాభినయం

### 17న శ్రీలక్ష్మీగణపతి హోమం

గుడివాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17వ తేదీన సంకటహర చతుర్థి సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనేవారు దేవస్థాన కార్యాలయంలో రూ.516లు చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. పూజలో పాల్గొనే ఉభయదాతలకు దేవస్థానం తరుపున పూజాసామగ్రిని అందిస్తామని ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు.



దుర్గా ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎంపీపీ గద్దె పుష్పరాణి

### వైసీపీ గుడివాడరూరల్ మండల అధ్యక్షుడి ఎన్నిక

గుడివాడ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):గుడివాడ రూరల్ మండల వైసీపీ మండల అధ్యక్షులు బొమ్ములూరు మాజీ సర్పంచ్ చిన్ని దుర్గా ప్రసాద్‌ను వైసీపీ అధిష్టానం నియమించింది. ఎంపీపీ గద్దె పుష్పరాణి, దొండపాడు మాజీ సర్పంచ్ గద్దె రామాంజనేయులు బొమ్ములూరు వెళ్లి చిన్ని దుర్గా ప్రసాద్‌ను అభినందించారు. కృష్ణా జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులుగా మట్టా జాన్ విక్టర్‌ను నియమించింది. వైసీపీ జిల్లా పార్టీ కార్యదర్శిగా కారే జోసఫ్‌ను నియమించింది. దుర్గా ప్రసాద్, మట్టా జాన్ విక్టర్, కారే జోసఫ్‌లు అభినందించారు.

### వైసీపీ పెదపారుపూడి మండల అధ్యక్షుడిగా గోగం

పెదపారుపూడి: పెదపారుపూడి మండల వైసీపీ అధ్యక్షునిగా మండల పరిషత్ అధ్యక్షులు గోగం సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం సురేష్‌కు గురుతర బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



గతంలో ఎనిమిదేళ్ల సమర్థవంతంగా పార్టీ అధ్యక్షులు బాధ్యతలను చేపట్టి, పార్టీని పటిష్టంగా ముందుకు తీసుకెళ్లిన సురేష్‌కు మరోసారి అధ్యక్ష పదవీ అప్పగించటంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తనకు తిరిగి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి, పామర్రు వైసీపీ ఇంచార్జ్ కైలే అనీల్ కుమార్‌కు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరానగర్‌కు వసతులు కల్పించండి: సీపీఎం

గుడివాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ఇందిరానగర్‌లో రహదారి భారీ గోతులతో అధ్వానంగా తయారైంది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇందిరానగర్‌కాలనీలో శుక్రవారం ప్రజాచైతన్యయాత్ర నిర్వహించారు. కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20ఏళ్లుగా కాలనీ దుస్థితి దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వాలు మారిన సమస్యలను పరిష్కారం కాలేదన్నారు. రహదారులతో పాటు డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.రజిని, రేపాని కొండ, లంకా సురేంద్ర, స్థానికులు భాషా, రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాచైతన్య యాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

## షటిల్ పోటీల్లో ఏజీకే విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాజస్థాన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి వెటరన్ గేమ్స్-2025లో స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని షటిల్ కోర్టు క్రీడాకారులు కె.ఎల్ శ్రీనాథ్, నాగమల్లేశ్వరరావులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్టు డీసీఈబీ కార్యదర్శి షేక్ జాన్ సాహెబ్ తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణలో పతకగ్రహీతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈడే శ్రీనివాస్, ఈడే వెంకటేశ్వరరావు, ఎం.అమ్మన్నబాబు, మీరా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.




క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు విజయవంతం చేయండి

పెదపారుపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెల మూడో శనివారం నాడు జరిగే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రద్దుపై ప్రత్యేక తీర్మానం కోసం గ్రామసభలు నిర్వహించనున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. ప్రతీ గ్రామ పంచాయతీలో రోజువారీ జరిగే పారిశుధ్యం, మంచినీటి సరఫరా కార్యక్రమాలతోపాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రద్దు విషయమై దుకాణదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటడం, చెత్త విభజన సేకరణ మీద ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మండలాలన్నీ జిల్లాలో ముందు వరుసలో ఉంచాలని ఈవోపీఆర్‌డీ వంగా శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

## పాడి రైతులకు తప్పని తిప్పలు



దోసపాడులో మూసి ఉన్న పశువైద్యశాల

పెదపారుపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):దోసపాడు గ్రామంలో పశువైద్యశాల తెరవకపోవటంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు తలుపులు వేసి ఉండటంతో పశువులకు ఏమన్నా వైద్యం నిర్వహించాలంటే అందుబాటులో వైద్యులు ఉండటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని పాడి రైతులు కోరుతున్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

గుడివాడ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండల పరిధిలోని చిన ఎరుకపాడు గ్రామంలో వేంచేసియున్న అష్టలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి పాల్గుణ పౌర్ణమి, అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మి గణపతి హోమం, నవగ్రహ, సుదర్శన, నాగవల్లి సింధూర హోమం, అమ్మవారి మూలమంత్ర శాంతి హోమాలు నిర్వహించారు. 400 మందికి అనదానం చేశారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



## పిఠాపురానికి తరలిన జనసేన శ్రేణులు



పామర్రులో ర్యాలీని ప్రారంభిస్తున్న జనసేన ఇన్‌చార్జి తాడిశెటి నరేష్

పామర్రు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో పిఠాపురంలో జరుగుతున్న జనసేనపార్టీ 12వ ఆవిర్భావ సభకు పామర్రు నియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త తాడిశెట్టి నరేష్ నేతృత్వంలో శుక్రవారం పామర్రులో గల జనసేన కార్యాలయం నుంచి బస్సులు, కార్ల ర్యాలీతో ఆపార్టీశ్రేణులు తరలివెళ్లారు. తొలుత ర్యాలీని నరేష్ జెండా ఊపి ప్రారంభించారు. డీజేసౌండ్ సిస్టంతో జనసైనికులు జయహోపిఠాపురం, జై పవన్‌కల్యాణ్, జై జనసేన అంటూ సందడిచేస్తూ పిఠాపురానికి బయలుదేరారు.

గుడివాడ : పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు గుడివాడ నుంచి జనసేన శ్రేణులు భారీగా తరలివెళ్లారు. శుక్రవారం స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయం వద్ద వాహన శ్రేణికి పార్టీ పట్టణాధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పిఠాపురానికి రెండు బస్సులు, 20కార్లతో ర్యాలీగా తరలివెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, షేక్ మీరా షరీఫ్, వినోద్, వెంకట్, అంజనేయులు, బుడమా రాజు, సాయికృష్ణ, భాను, నరసయ్య, భవాని, శిరీష, సౌమ్య, కుమారి, దుర్గ పాల్గొన్నారు.



గుడివాడ నుంచి పిఠాపురం బయలుదేరి వెళ్లిన జనసేన నాయకులు, కార్యకర్తలు

## కొల్లు ఫౌండేషన్ ఇఫ్తార్ విందు



మచిలీపట్నం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణ పబ్లిక్ స్కూల్ ఎదురు మసీదులో కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, నగర టీడీపీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, ప్రభుత్వ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ అజీమ్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు బాజానీ, ఆసీఫ్, పాషా, రఘు, చంటి పాల్గొన్నారు.



చనిపోయి చెరువులో తేలియాడుతున్న చేపలు

## చేపల చెరువులో విషప్రయోగం

బంటుమిల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పెద తుమ్మిడి గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ నాగమునీంద్రరావు చేపల చెరువులో విషప్రయోగం జరిగి చేపలు మృత్యువాత పడ్డాయి. నాగమునీంద్రరావు జయపురం కాంప్లెక్స్ రోడ్‌లో 2.20 ఎకరాల విస్తీర్ణం చెరువులో చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నారు. చేపలు, రొయ్యలు పట్టుబడికి రావడంతో అమ్మకానికి ఏర్పాట్లు చేసుకుంటున్న ఆన గురువారం రాత్రి చెరువు వద్దకు వెళ్లి చూడగా చేపలు తేలియాడుతూ కన్పించాయి. గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో విష ప్రయోగం చేశారని పేర్కొంటూ బంటుమిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చెరువును పరిశీలించి నీటి శాంపిల్ పరిశీలించారు. దాదాపు రూ.2.50 లక్షల నష్టం జరగడంతో కుటుంబం పూర్తి విచారంలో మునిగిపోయింది. అధికారులు స్పందించి న్యాయం చేయాలంటూ వేడుకుంటున్నారు.



విద్యార్థులకు బహుమతులందజేస్తున్న ఎంపీపీ దుర్గావాణి

## ఉత్తర చిరువోలులంక పాఠశాల వార్షికోత్సవం

మోపిదేవి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర చిరువోలులంక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఎంపీపీ రావి దుర్గావాణి ముఖ్యఅతిథిగా వైస్ ఎంపీపీ నడకుదుటి జననీ కుమారి, సర్పంచ్ చింతా శ్రీనివాసరావుతో కలిసి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నడకుదుటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవంలో ఎంఈవో దుర్గా సాగర్, గ్రామ ప్రముఖులు నడకుదుటి జనార్దనరావు, అడపా గురవయ్య, రావి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నం నుంచి తరలివెళ్తున్న బస్సుకు జెండా ఊపుతున్న కార్పొరేటర్ చాయాదేవి



అవనిగడ్డ నుంచి పిఠాపురం బయలుదేరి వెళ్తున్న జనసేన నాయకులు

# జయకేతనం సభకు జనసేన

● పట్టణం, గ్రామాల నుంచి భారీగా తరలివెళ్లిన నాయకులు

మచిలీపట్నం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు జిల్లా కేంద్రం మచిలీపట్నం నుంచి శుక్రవారం పెద్ద ఎత్తున జనసేన నాయకులు పిఠాపురం తరలి వెళ్లారు. జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించారు. పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ముందుగానే ఏర్పాట్లు పరిశీలించేందుకు పిఠాపురం వెళ్లగా మిగిలిన మచిలీపట్నం నియోజక వర్గంలో



నాగాయలంక నుంచి..



పెడన మండలం ఉరివి గ్రామం నుంచి...

జనసేన నాయకులు, కార్యకర్తలు మచిలీపట్నం నగర జనసేన అధ్యక్షుడు గడ్డం రాజు ఆధ్వర్యంలో పిఠాపురం తరలివెళ్లారు. నాయకులు వంపుగడల చౌదరి, మాదివాడ రాము, కొట్టే వెంకటరావు, పెదశింగు చిరంజీవి, శాయన శివ, మహమ్మద్ సమీర్, జన్ను నాగరాజు, చలమలశెట్టి శ్రీనివాస్, తోట రాజేష్ , పినిశెట్టి వేణు, దివి మహేష్ తదితరులు పాల్గొన్నారు. **పెడన రూరల్** : పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం జయకేతనం సభకు మండలంలోని ఉరివి, చెన్నూరు, నడుపూరు, బల్లిపర్రు, నేలకొండపల్లి, పెనుమల్లి, ముచ్చర్ల తదితర గ్రామాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాలలో తరలి వెళ్లారు. నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త పంచకర్ల సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు ఊ చా వెంకయ్య నేతృత్వంలో తరలి వెళ్లారు. **కోడూరు** : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సభకు మండల జనసేన పార్టీ నేతలు భారీగా తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు మర్రె గంగయ్య



కోడూరు మండల కేంద్రం నుంచి..

నేతృత్వంలో జనసేన పార్టీ కార్యాలయం వద్ద నుంచి వివిధ రకాల వాహనాలలో బయలు దేరి వెళ్లారు. జనసేన నాయకులు కోట రాంబాబు, కొండవీటి సునీత, కడవకొల్లు శ్రీనివాసరావు, పూతబోయిని కరుణ్ కుమార్, కాగిత రామారావు, ఉల్లి శేషగిరిరావు, దామెర్ల నారాయణరావు, నాగం రఘు, గాదె రమేష్ తదితరులు ఉన్నారు.

**అవనిగడ్డ** : జనసేన పార్టీ ఆవిర్భావ సభకు అవనిగడ్డ నుంచి భారీగా జనసైనికులు తరలివెళ్లారు. జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శేషబాబు, పట్టణ పార్టీ అధ్యక్షు వీరబాబు నేతృత్వంలో ర్యాలీని మండలి వెంకట్రామ్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. టీడీపీ నేతలు యాసం చిట్టిబాబు, బండే రాఘవ, బండే కనకదుర్గ, ఘంటసాల రాజమోహనరావు, ఆరు మండలాల జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు. **నాగాయలంక** : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు శుక్రవారం నాగాయలంక మండలం నుంచి జనసైనికులు పలు వాహనాలలో తరలివెళ్లారు. బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, మల్లిఖార్జునరావు, రేవు సువర్ణరాజు, భోగాది శివ విష్ణు తదితరులు నినాదాలు చేస్తూ తరలివెళ్లారు.

### జనసైనికులకు భోజనం

చల్లపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు అవనిగడ్డ నియోజకవర్గం నుంచి తరలివెళుతున్న జనసైనికుల కోసం పార్టీ సీనియర్ నాయకులు అడపా రాంబాబు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు.

చల్లపల్లిలోని రాంబాబు స్వగృహంలో ఆహారం తయారు చేయించి ప్యాకింగ్ చేయించి మండలాల వారీగా వాహనాలకు అందజేశారు. ఈ ఏర్పాట్లను శుక్రవారం తెల్లవారుజామున యువనేత మండలి వెంకట్రామ్ పరిశీలించారు. అడపా రాంబాబు సహకారం అభినందనీయమన్నారు. ఆకుల స్వభూప్రసాద్, రావులపల్లి పండు గురుస్వామి, గంగిశెట్టి రాజేంద్ర, ఎం.రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో భోజనం ప్యాకెట్లు సిద్ధం చేసిన మండలి వెంకట్రామ్, అడపా రాంబాబు



విశ్వనాథపల్లి నాంచారమ్మ సంబరంలో భక్తులు



పెదప్రోలులో నాంచారమ్మను దర్శించుకుంటున్న మండలి వెంకట్రామ్, భక్తులు

# విశ్వనాథపల్లి, పెదప్రోలులో భక్తుల కోలాహలం

● వైభవంగా అద్దంకి నాంచారమ్మ జాతర

కోడూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథపల్లి గ్రామంలో కృష్ణానది తీరాన కొలువైన ద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరకు శుక్రవారం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. జాతరను పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి ప్రత్యేక పూజలు నిర్వహించగా, విశేషాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక షెడ్లలో పాలు పొంగించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో జయశ్రీ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులు, దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో ఆరు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. డిఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, సీఐ యువకుమార్,



అమ్మవారిని దర్శించుకుంటున్న సీఐ, ఎస్సై, పక్కన అన్నదానం

కోడూరు ఎస్సై చాణిక్య పర్యవేక్షణలో 200 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. **మోపిదేవి** : పెదప్రోలులో అద్దంకి నాంచారమ్మ వార్షిక జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో తరలి వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. మహా అన్నసమారాధనను మండలి బుద్దప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, కోడలు సుప్రియ, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో విశేష అలంకరించారు. జాతరను పురస్కరించుకుని ఉదయం నుంచి రాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ కుర్రా గురు ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య, కార్యదర్శి కెవిఎన్.కె.కోటేశ్వరరావు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. జాతర మహోత్సవం పురస్కరించుకుని కుక్కల జయలక్ష్మి, గొరిపర్తి రాజేశ్వరి జ్ఞాపకార్థం గొరిపర్తి రవికాంత్ ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణ పారంభించారు. 10 వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

# జగన్మాత నామ పారాయణతో లక్ష్మీ కటాక్షం



మచిలీపట్నం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జగన్మాత నామస్మరణతో లక్ష్మీదేవి కటాక్షం పొందవచ్చని త్రిదండి శఠగోపముని జీయర్ స్వామి, త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి అన్నారు. బలరామునిపేటలో నాలుగు రోజుల పాటు నిర్వహించే దయాకుంభ్ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వెయ్యి మంది మహిళలు లక్ష్మీసహస్ర నామ పారాయణ చేశారు. శ్రీకర రామానుజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో త్రిదండి శఠగోపముని జీయర్ స్వామి, త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి అభిభాషించారు. సామాజిక సేవ, దైవ సేవ నిర్వహిస్తున్న లక్ష్మీరామానుజ దాసి, సామా కుమారి, తమ్మా హైమావతి, యెండూరి సుధ, తోట విజయకుమారిలను ఘనంగా సత్కరించారు. గరుడ సేవ నిర్వాహకులు చిట్టి కుమారి పర్యవేక్షించారు. వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

అవనిగడ్డ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. హాల్ టిక్కెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని, ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## వేకనూరును శాంతిసీమగా మార్చిన గరికపాటి



గరికపాటి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

అవనిగడ్డ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వేకనూరు పంచాయతీని శాంతిసీమగా మార్చిన ఘనత మాజీ సర్పంచ్ గరికపాటి శ్రీనివాస్‌కు దక్కిందని వక్తలు పేర్కొన్నారు. గరికపాటి సంస్మరణ కార్యక్రమం శుక్రవారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు గాజుల మురళీ కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. గరికపాటి విగ్రహానికి యాసం చిట్టిబాబు, బండే శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, మాదివాడ వెంకట కృష్ణారావు, గరికపాటి వెంకటేశ్వరరావు (పెద్దోడు), మాదివాడ నిరంజనరావు, తుంగల శ్రీనివాసరావు, సుధాకర్, గరికపాటి హరిబాబు, మాదివాడ శేఖర్ పాల్గొన్నారు.

# చల్లపల్లి లయన్స్ సేవలు స్ఫూర్తిదాయకం

చల్లపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి లయన్స్‌క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. గవర్నర్ అధికారిక పర్యటన సందర్భంగా శుక్రవారం లయన్స్‌క్లబ్ మల్టీపర్పస్ సర్వీస్ సెంటరులో ఆయన ప్రసంగించారు. ఎమిమి వేల మందికి పైగా కంటిఆపరేషన్లు చేయించిన ఘనత చల్లపల్లి క్లబ్ ప్రతినిధులదేనన్నారు. లయన్స్ సేవా కార్యక్రమాల్లో మరింతమంది ప్రజల్ని భాగస్వాములను చేయాలని కోరారు. చార్టర్ సభ్యులనులయన్స్ ఇంటర్నేషనల్ బ్యాడ్జీలతో సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు రాయపాటి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో వైపీసీ.ప్రసాద్, సిహెచ్.శ్రీనివాసరెడ్డి, ఎం.చక్రధర్, కొల్లి ఎన్‌విఆర్‌కె.ప్రసాద్, ఉపద్రష్ట రాం



గద్దె శేషగిరిని సన్మానిస్తున్న చల్లపల్లి క్లబ్ ప్రతినిధులు

బాబు, కస్తూరి ప్రసాద్, ముమ్మనేని నాని, నర్రా సాయిబాబు, టి.సాంబశివరావు, ఎస్‌జిఏ.బాషా, మోపిదేవి వెంకటేశ్వరరావు, కొల్లిపర మధు, వరదా హరిగోపాల్, కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు, ధనుం జయరావు తదితరులు పాల్గొన్నారు. చిరువ్యాపారులకు గొడుగులు, నిరుపేద వికలాంగురాలికి రూ.5వేల నగదును గవర్నర్ శేషగిరి చేతులమీదుగా అందజేశారు.



## అయ్యప్పస్వామికి విశేష పూజలు



కోడూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి జన్మదిన వేడుక వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో మూల విరాట్‌కు పంచామృత అభిషేకం, హోమాలు నిర్వహించారు. భక్తుల స్వహస్త హస్తాలతో స్వామి వారికి పాలాభిషేకం చేశారు. మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బడే భావనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించగా, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## చౌడేశ్వరిదేవి జ్యోతిర్మహోత్సవాలు ప్రారంభం



మచిలీపట్నం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : చింతగుంటపాలెంలో చౌడేశ్వరీ జ్యోతిర్మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అలుగుసేవ, దేవల మహర్షికి అర్చనలు జరిపారు. అన్నప్రసాదం పంపిణీ చేశారు శనివారం రాత్రి కత్తులతో ఊరేగింపు జరుగుతుందని నిర్వాహకులు యర్రా శ్రీనివాసరావు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మచిలీపట్నం, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : చిన్నాపురం, వాడపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ జి గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## నేడు పెడన కౌన్సిల్ సమావేశం

పెడన, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ ఎం. గోపాలరావు తెలిపారు.

## గూడూరులో అన్నసమారాధన

గూడూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : గూడూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి స్వామి వారి రథోత్సవం జరిగింది. ఏర్పాట్లను ఆలయ ఈవో తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు పర్యవేక్షించారు.